# 'సంవత్సరం అదే చేస్తోవుంటారట'

• కె. వి. సూర్యనారాయణ •

'ముందరపోసుకున్నవాళ్ళు ముత్యాలగొడుగులు, వెనకపోసుకున్నవాళ్లు వెండి గొడుగులు—ఒరేయ్ రఘు, రాము ఎవరు ముందో పోస్తే వాళ్లే మంచివాళ్లు' అంది శారద సంవత్సరాదినాడు తెల్లారకుండా పిల్లల్ని తలంటుకానికి తొందరచేస్తూ. బద్ధకంతో పిల్లలిద్దరూ లేవకపోయినా వంటపిల్ల మాత్రం ఇంటిమీద కుంకులు లేవ కొడుతోంది. ఉగాది వాతాపిజీర్ణం చదివేటప్పటికి రాము లేచి నేను ముందరపోస్తానని గంతులేస్తున్నాడు. రఘు వాడు పోస్తేగాని వాడికి పోయ్యకూడదని పేచీపెట్టాడు. కుర్రాళ్ళని సవరించి స్నానం చేయించింది.

రామారావు ఆఫీసు కాగితాలు ముందరవేసుకొని చూస్తున్నాడు. సంవత్సరాదినాడు ఏపని చేసే సంవత్సరం అదే చేస్తోవుంటారుట. ఈ వేళటికేనా యీ కాగితాలు తీసేయండి అంది పనితొందరలో, అయితే నువ్వు వంట మానేయ్ సంవత్సరం పొడుగునా వంటక్కరలేదన్నాడు—కాగితాలు తిరగవేస్తో.

ఆఁ అన్నట్టు గుర్తుకు వచ్చిందండోయ్! వంటమనిషి యీ వేళనుంచి వస్తుందని చెప్పారుగా యింకా అన్నీ యెప్పుడవుతాయా అని కొట్టుకుంటున్నాను. మీ ధర్మమా అంటో యీ నాటికి మనిషిని పెట్టారు. సంవత్సరాన్నుంచి నూట ఏభై తెస్తోన్నా-అంటూ మినప్పప్పులో నీళ్ళు పోసింది.

ఎప్పుడొస్తుందో? సంవత్సరాదినాడు పొద్దున్నే రావాలని తెలవదా? అప్పుడే ఎనిమిది గంటలు పొద్దెక్కింది అని లేని నౌఖరుమీద కేకలేస్తోంది.

ఆఁ మొదలుపెట్టావ్ సాధింపు ఇట్లా అయితే ఒఖ్ఖరోజు ఆ మనిషి ఆగదు. సంవత్సరాది దానికి మాత్రం కాదేమిటి?

ఏమిటో! మీ గొడవా, మీరున్నా నా తిప్పలు నేను పడతానులెండి! ఇదిగో ఒరే రఘూ! వేపపువ్వుపచ్చడి తినకుండా ఏమీ తినకూడదుసుమా! ఓరీ! భడవా-చూశావా, రాముడు మైసూరుపాకం తినేస్తున్నాడు.

వీళ్ళకి పండుగలేమిటి? చేసేపని తక్కువైనా హంగామా ఎక్కువచేస్తోంది. ఈలోగా ఆఫీసు నౌకర్లు, ఇంటి నౌకర్లు వచ్చేరు. తలోపనీ పురమాయించింది. వంటమనిషిపై కారాలు మిరియాలు నూరుతోంది.

ఇంతట్లోకి ఓ పూర్వపువాసిని వచ్చింది-రామారావుగారి ఇల్లిదేనా అంటో.

చాల్లెండి ఇంత పొద్దుపోయాక రావడము అప్పుడే తొమ్మిది కావస్తోంది. పండుగనాడు ఇల్లా ఐతే ఎల్లాగండీ? సరేలెండి! ఇప్పుడైతేం మడికట్టుకోండి. మినప్పప్పు నానబోశాను. తీసి నిన్నే చేశానులెండి.

పాపం ఆవిడ విస్తుపోయి చూస్తోంది-తన వారసత్వపు దావాలో తీర్పు ఏవిధంగా యిచ్చారో అడగడానికివచ్చిన వెంకాయమ్మగారు.

ఇంతట్లోకి రామారావు యివతలకివచ్చి చాలు! చాల్లే! నువ్వు వెళ్ళి వంటచేయ్. ఈ వేళటికి ఆవిడ రాదేమో! అని తెల్లబోయిన పెళ్ళాన్ని పంపించేసి పూర్వమే దక్షిణముట్టడంవల్ల వెంకాయమ్మగార్కి కోర్టు తీర్పును లోపలికి తీసుకువెళ్లి బోధిస్తున్నాడు. తన పక్షమే అయినందువల్ల వెంకాయమ్మగారి సంతోషంకొద్ది 100 రూపాయలనోటు చేతిలోపెట్టింది సంవత్సరాదిపూటా. రోజూకూడా అల్లా అవుతుందేమో అనుకున్నాడు రామారావు, (అది పూర్వపు పగతేలెండి)

భోజనాల అనంతరం ఎవరికి ఎన్ని సున్నాలున్నాయో చూసుకున్నారు. ఇంట్లో వంటపిల్లకు తప్ప ఎవ్వరికీ సున్నలా లేవు. ఆ సంగతి తెలుసుకుని 'ఎప్పుడూ రోగిష్టిదే' అనుకొంది తల్లి.

ఆదాయం రామారావుకి 15, వ్యయం 2. రాజపూజ్యం 3, అవమానం 9 సంవత్సరఫలం, భయం. సరేలే ఉద్యోగాల్లోవున్న వాళ్ళందరికీ వుండేవే, యివి అనుకున్నాడు. తనకు చూడమని శారద ఎంత బతిమాలినా అతడు ఆమె ఆదాయవ్యయం చూడలేదు. ఎందుచేతంటే శారద, ఆదాయవ్యయాలు తనమీదే ఆధారపడ్డాయి కనుక. కాని శారదకు రాజపూజ్యం 6, అవమానం 6. బోళా మనిషి అనుకున్నాడు.

రామారావు మామూలుగా ఆఫీసు కాగితాలు తిరగవేస్తున్నాడు. శారద రాత్రికి వంటప్రయత్నం చేస్తోంది. సంవత్సరం ఇంతే. ఇంక వంటమనిషిని కుదర్చరు అనుకుంటో.